పనిని చేస్తున్నానన్న ధైర్యం. మరి ఆపనే యిప్పుడు అమ్మచేస్తోందని తెలిసినప్పుడు బాధగావుంది.

రోడ్డుమీద నడుస్తున్నాడు. టాక్సీలోపోతే...

అందరూ అనుకునేది నిజమన్నమాట. అవును. ఆమధ్యకొన్ని పత్రికలుకూడా వ్రాసినవ్. అంటే నాన్న రాజకీయ వైకుంఠపాళిలో అమ్మ ఒక నిచ్చెనా? ఒకవేళ నాన్నకుతెలియకుండా అమ్మ యిలాచేస్తోందేమో అది సంభవంకాదు. తనకు బుద్ధితెలిసి నప్పటినుండి దూరంగావుండి చదువుకున్నాడు. కావాలనే దూరంగాఉంచారా?

అమ్మ యెవరితో యీరోజు హోటల్లో గడిపింది? పెద్దనాయకుడెవ్వరూ యీ ఊరు వచ్చినట్లులేదే! ఎవరన్నా పెద్ద వ్యాపారవేత్త వున్నాడేమో?... అందుకనేనా నాన్న వరదప్రాంతాల పర్యటనకు వెళ్ళింది. వేగంగానడవటం మొదలుపెట్టాడు. ఏయ్ టాక్సీ. టాక్సీ వెళ్ళిపోయింది. కసిగా ఇంకావేగంగా నడవటం మొదలుపెట్టాడు.

ఎండ నెత్తిమీదికివస్తోంది. తనకు గమ్యంలేదు. జనం మెల్లమెల్లగా చిక్కబడుతున్నారు రోడ్లమీద. ఇంకొంచెం ముందుకుపొయ్యేసరికి జనం యెక్కువయ్యారు. అక్కడ పోలీసులేదో బారునుతీరి జనాన్ని ముందుకురాకుండా అడ్డగిస్తున్నారు. ఆఅడ్డు కట్టమూలంగా జనం అక్కడ ఆగిపోయిన ప్రవాహంలాగా పైకిపొంగుతున్నారు. కేకలు వేస్తూ, ఈలలువేస్తూ తోసులాడుకుంటున్నారు: ఎందుకింతజనం యిక్కడవున్నారు. తను కాలేజీలో సమ్మెచేసినప్పుడు యిట్లాగావుండేది. అక్కడనవ్వుతూ తుళ్లుతూ నినాదాలు చేసేవాళ్లు ఇక్కడకొంతమంది నవ్వుతూ అరుస్తున్నారు. చాలామందికి ఎందుకు నినాదాలు చేస్తున్నారో తెలిసినట్లులేదు. చాలా నిర్వికారంగా వున్నవ్ వాళ్ళ ముఖాలు. ఎవరో ముందువరసలో అరుస్తూ మిగతాజనాన్ని అనిపిస్తున్నారు. "మాకోర్కెలు" అలాగా ఎవరు వారికోర్కెలు తీర్చడంలేదు? ప్రభుత్వమా?... "మంత్రులురాజీనామా చేయాలి" ప్రభుత్వమంటే మంత్రులా? అయితే నాన్నకూడా...అరే నాన్న పేరుకూడా విన్పిస్తోందే! డౌన్! డౌన్! నాన్నని అడగాలి, తను యిన్నాళ్లూ ఇవన్నీపట్టించుకో లేదు. అమ్మాయిలు! సినిమాలు, చదువులు, బార్లు... తప్ప తనకేవేమీ తెలియవు. ఇంతబాగుంటుందా జనంలోకలిస్తే జనం ఒకరినొకరు తోసుకుంటున్నారు. వెనకాలే తమవెంటవస్తున్న పోలీసులను అవహేళనచేస్తున్నారు. ఎంతధైర్యం. జనంలోకలిస్తే ధైర్యంవస్తుందా! ముందు జనం ఆగిపోయారు. వెనక జనం ముందుకునెట్టుతున్నారు. కేకలు, ఈలలు, జనంలో ఉద్రేకం.

అమ్మో! జనం పరిగెత్తుతున్నారు. తాను మధ్యలో చిక్కుబడి పొయ్యాడు. అంతా గందరగోళంగావుంది. టాక్సీలోపోతే బాగుండేది. లాఠీచార్జీ జరుగుతోం[illegible]!

351

